ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024

• పశువుల తొట్టి నీరే దిక్కు..!

పశువుల తొట్టి వద్ద క్యూలో బిందెలు





తొట్టిలో నీటిని పట్టుకుంటున్న మహిళలు

అసలే వేసవి. ఎండలు మండిపోతున్నాయి. తాగునీటి కోసం జనం తహతహ లాడుతున్నారు. ఏటా వేసవికి ముందు పాలకులు, అధికారులు.. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్య చేపట్టేవారు. బోరు మరమ్మతులు, నీటి ట్యాంకర్లు సిద్ధం చేసుకునేవారు. ఆ మేరకు ప్రభుత్వం నిధులిచ్చేది. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్రామ పంచాయతీల వద్ద పైసా కూడా లేదు. ప్రభుత్వమూ ఇవ్వలేదు. వెరసి.. ప్రజలకు దాహపు కేకలు తప్పలేదు. మడకశిర మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు లోనైంది. అదీ ఏడు నెలల క్రితం. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. కనీసం వేసవిలోనూ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. దీంతో గ్రామస్థులు నీటి తిప్పలు తప్పట్లేదు. గ్రామ చివరన ఉన్న పశువుల తొట్టిలోని నీరే వారికి దిక్కవుతోంది. ఆ నీరు కూడా గ్రామానికి చాలట్లేదు. దీంతో పెద్దసంఖ్యలో బిందెలను క్యూలో ఉంచి, వంతు కోసం వేచిచూడాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోరు మరమ్మతులు చేపట్టి, తాగునీరు అందించాలని కోరుతున్నారు.

-మడకశిర రూరల్

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 28.0	41.0 29.0	42.0 29.0	39.0 27.0	40.0 28.0

•వైసీపీ సర్పంచ్ దర్జా

పంచాయతీ బోరు నీరు తోటకు మళ్లింపు
గ్రామస్థులకు అరకొరగా సరఫరా..
పట్టించుకోని అధికారులు



గ్రామ ప్రజలకు సేవ చేయాల్సిన సర్పంచ్ వారి గొంతులు ఎండబెట్టి, పంచాయతీ బోరు నీటిని తన తోటకు మళ్లించుకున్నారు. నెలలుగా నీటిని వాడుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ధర్మవరం మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో పంచాయతీకి సంబంధించిన బోరు నీరు ప్రజలకు వదలకుండా వైసీపీ మద్దతు సర్పంచ్ ఈశ్వరమ్మ తోటకు మళ్లించుకున్నారు. ఏకంగా బోరు నుంచి గ్రామానికి సరఫరా అయ్యే పైపులైన్‌కు పైపును ఏర్పాటు చేసుకుని, నీటిని తోటకు తరలిస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులైన వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పొలాలకు సైతం వాడుకుంటున్నారు. అసలే వేసవి కావడంతో గ్రామంలో తాగునీరు అరకొరగా సరఫరా అవుతోందనీ, పలు కాలనీలకు అస్సలు రావట్లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తోటకు పంచాయతీ బోరు నుంచి నీరు వాడుకుంటున్న విషయం అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడట్లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పంచాయతీ బోరు నీరు గ్రామానికి సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

- ధర్మవరం రూరల్



పంచాయతీ బోరు నుంచి వైసీపీ నాయకుడి తోటకు ఏర్పాటు చేసుకున్న పైపులైన్ (వృత్తంలో)

గుప్..గుప్..!

మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పలుమార్లు సీఎం జగన్ ప్రకటించారు. ఆ వెంటనే జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై పెద్దపెద్ద హోర్డింగులు ఏర్పాటు చేసి, అవగాహన పెంచుతున్నట్లు కలరింగ్ ఇచ్చారు. జిల్లాలోకి గంజాయి రవాణా, క్రయ విక్రయాలపై నిరంతరం నిఘా పెట్టి ఉక్కుపాదం మోపుతున్నామని పోలీసు శాఖ హెచ్చరికలు చేస్తోంది. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం సంగతి అటుంచితే ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రశాంతమైన జిల్లాకు మాయదారి మత్తు మొక్కలు వచ్చాయి. మత్తు కమ్మేసింది. మత్తు వలయంలో చిక్కుకున్న యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో పోలీసులకు పట్టుబడిన గంజాయి ఉదంతాలే ఇందుకు నిదర్శనాలు. పోలీసులు మాత్రం గంజాయిపై ఉక్కపాదం మోపుతున్నామనీ, కఠిన వైఖరి అవలంబిస్తున్నామనీ, జిల్లాపై ప్రభావం లేదని దాటవేస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో పట్టుబడుతున్న గంజాయి సంగతేంటో వారే చెప్పాలి.

■ ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



ప్రశాంత వనంలో గంజాయి మొక్కలు

☛ నాలుగు నెలల క్రితం హిందూపురంలోని రహమత్‌పురం సర్కిల్ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు లేపాక్షికి చెందిన ఓ డ్రైవర్ వేచి ఉన్నాడు. అటువైపు వెళ్తున్నామంటూ ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని, డీబీ కాలనీ వద్ద ఇటుకతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు దుండగులు. డ్రైవర్ చికిత్స పొందుతూ కర్నూలులో మృతిచెందారు. దాడి చేసిన యువకులు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

☛ హిందూపురంలో గతేడాది జూలై 24న టూటౌన్ పోలీసులు గంజాయి విక్రమిస్తున్న పది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఒకరిని అరెస్టు చేశారు. వారి వద్ద 9 కేజీల గంజాయి పట్టుబడింది.

■ జిల్లాను కమ్మేసిన మత్తు
■ యథేచ్ఛగా రవాణా, విక్రయాలు
■ మూలాలు విశాఖలో..

విశాఖ నుంచి జిల్లాకు..

విశాఖ, ఒడిశా ఏజెన్సీల్లో సాగయ్యే గంజాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వైసీపీ అధికారం చేపట్టాక పరిపాలన రాజధానిగా ప్రకటించిన విశాఖ నుంచి జిల్లా మీదుగా కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు రైళ్లలో గంజాయి రవాణా అవుతోంది. ఇది లాభసాటిగా ఉండటంతో ముఠాలుగా ఏర్పడి, మరీ దందా సాగిస్తున్నారు. ఇటీవల కొన్నేళ్లుగా జిల్లా పోలీసులకు పట్టుబడిన ఘటనలను బట్టి డ్రగ్స్ మూలాలు విశాఖలో వెలుగుచూశాయి. గంజాయి విక్రేతలు విశాఖకు వెళ్లరు, అక్కడి నుంచి విక్రయాలకు ఇక్కడికి రారు. అత్యధికంగా రైళ్లలో పంపుతారు. రైలులో గంజాయిని పంపుతూ మారు కోడ్ పెట్టుకుంటూ సమాచారం చేరవేస్తున్నారు. తద్వారా కొంతమంది అనంతపురం, ధర్మవరం, హిందూపురంలో రైలెక్కి గంజాయి మూటలను చాకచక్యంగా రైలు నుంచి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. జిల్లాలో పోలీసులకు పట్టుబడిన గంజాయిలో అత్యధికంగా విశాఖ ఏజెన్సీ నుంచి సరఫరా చేసినట్లు స్పష్టమైంది.





కోడ్ భాషతో..

గంజాయి ముఠాలు యువతతోపాటు కార్మికులను లక్ష్యంగా చేసుకుని, వారికి విక్రయాలు సాగిస్తున్నాయి. కర్ణాటక సరిహద్దుతోపాటు తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడలో బీహార్, అసోం, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లాకు అత్యధికంగా కర్ణాటక సరిహద్దు ఉండడంతో అక్రమ మద్యం, గుట్కా, గంజాయి రవాణాకు రాచమార్గంగా మారింది. యువత, కార్మికులకు వలవేసి, గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి పేరు నేరుగా చెప్పకుండా, పోలీసుల కంటపడకుండా కోడ్ భాష పెట్టుకుని, విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు స్ట్రోక్ అని పిలుచుకుంటే, మరికొందరు ఎంజాయ్ అని పేరు పెట్టి, ఇంకొందరు మజా అని ఇలా రకరకాల కోడ్ భాషలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి, మాదక ద్రవ్యాలపై పోలీసులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, కౌన్సెలింగ్ ఇస్తున్నా ఏదో ఒక మార్గంలో యువత, కార్మికుల చేతికి చేరుతోంది. గంజాయికి బానిసలైన యువత చదువు పక్కన పెట్టి డబ్బుకోసం చోరీలు, దాడులకు తెగబడుతున్నారు. ప్రశాంతమైన జిల్లాలో కొన్నేళ్లుగా పట్టుబడుతున్న గంజాయి, మత్తు పదార్థాలు పోలీసు శాఖను కలవర పెడుతున్నాయి. జిల్లాలో కొన్నాళ్లుగా జరుగుతున్న దాడులు, గొడవల్లో అధికంగా మత్తులో జరిగినవే.



బయట బెంగళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నా జిల్లాలో డ్రగ్స్ విక్రయాల కోణంలో పోలీసులు ఆరా తీయకుండా వదిలేశారన్న విమర్శలు న్నాయి.

జిల్లాలో పోలీసులకు పట్టుబడిన మత్తు పదార్థాల వివరాలివీ..

☛ 2022 ఆగస్టులో హిందూపురానికి చెందిన రోహిత్ గంజాయి సరఫరా చేస్తూ కర్నూలు జిల్లాలో పోలీసులకు పట్టుబడ్డాడు.

☛ 2022 సెప్టెంబరు 24న మాదకద్రవ్యాల విక్రయం, తరలింపు కేసులో నలుగురిని కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చినట్లు తేలింది. పుట్టపర్తి రైల్వేస్టేషన్ ఎదుట ఓ మహిళ మాదక ద్రవ్యాలతో వేచివున్నట్లు పక్కా సమాచారంతో బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడులు చేసి, నలుగురిని అరెస్టు చేశారు. రూ.7.8 కోట్ల విలువ చేసే గంజాయి, మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని అరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆమెను ప్రశాంతి రైల్వేస్టేషన్

2022 ఫిబ్రవరిలో కాకినాడ జిల్లా తుని నుంచి జిల్లాలోకి రవాణా చేస్తున్న 36 కేజీల గంజాయిని ముదిగుబ్బ రైల్వేస్టేషన్ వద్ద స్వాధీనం చేసుకుని, పదిమంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అదే నెలలో ధర్మవరంలోని రాజేంద్రనగర్‌లో ఇద్దరు యువకులను పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

☛ 2023 జూన్ 23న అధికార పార్టీకి చెందిన నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ కారుకు అతికించుకుని అనంతపురం నగరానికి చెందిన ఐదుగురు యువకులు గంజాయి సేవించి వెళ్తూ మత్తులో కాళసముద్రం వద్ద ద్విచక్రవాహనదారుడిపై దాడి చేశారు. రూ.3వేలు ఫోన్‌పే ద్వారా డబ్బు వేయించుకుని, ముదిగుబ్బలో అతివేగంగా నడిపి ఆటో డ్రైవర్‌ను ఢీకొట్టారు. నిందితులను ముదిగుబ్బ పోలీసులు అరెస్టు చేశారు. ఇలా జిల్లాలో గంజాయి ఉదంతాల్లో వెలుగుచూసినవి కొన్ని మాత్రమే. ఐదేళ్లలో పోలీసుల కళ్లుగప్పి గంజాయి రవాణా, విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న విమర్శలు లేకపోలేదు.

హిందూపురంలో గతేడాది పోలీసులకు పట్టుబడిన గంజాయి ముఠా (ఫైల్)



జిల్లా ఓటర్లు

14,07,550



తేలిన సార్వత్రిక ఎన్నికల ఓటర్ల లెక్క
మహిళలే అధికం

పుట్టపర్తి, మే2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల జిల్లా ఓటర్ల తుది లెక్క తేలింది. 2024 ఓటర్ల తుది జాబితా గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 14,07,550 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కతేలింది, ఇందులో పురుషులు 7,00,331 మంది ఓటర్లు, మహిళలు 7,07,155 మంది ఇతరులు 64 మంది ఓటర్లున్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళలు 6824 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా ఓటర్లు కదిరి నియోజకవర్గంలో ఉండగా.. తరువాత స్థానంలో ధర్మవరం ఉంది.

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మడకశిర	105836	105046	1	210883
హిందూపురం	124812	124430	19	249261
పెనుకొండ	118132	118032	4	246261
పుట్టపర్తి	104611	106896	12	211519
ధర్మవరం	122013	123983	20	246016
కదిరి	124906	128768	8	253682
మొత్తం	700331	707155	64	1407550

కూటమి మేనిఫెస్టో చూసి జగన్ గుండెల్లో రైళ్లు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప




మేనిఫెస్టో ప్రతులను విడుదల చేస్తున్న బీకే, కొల్లకుంట అంజినప్ప

పెనుకొండ, మే 2: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను చూసి ముఖ్యమంత్రి జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితో కలిసి గురువారం స్థానిక ఆయన కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు.. మేనిఫెస్టో ప్రతులను విడుదల చేశారు. కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమం, పేద ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. సామాజిక పింఛన్ సొమ్ము రూ.4వేలకు పెంపు, బీసీలకు 50ఏళ్లకే పింఛన్, మహిళలకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మొదలైన హామీలున్నాయన్నారు. ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం అవడం ఖాయమన్నారు. తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది, అధికారంలోకి రావడం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు సిద్దయ్య, రవిశంకర్, కురుబ కృష్ణమూర్తి, రొద్దం ప్రధాన కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

రైతు స్థలంపై వైసీపీ నాయకుడి కన్ను

ఖాళీ చేయాలంటూ బెదిరింపులు.. బాధితుడి ఆవేదన



ఆవేదన వ్యక్తం చేస్తున్న వీరజిన్నప్ప

పెనుకొండ రూరల్, మే 2: అధికారం ఉందికదా అని మండలంలో వైసీపీ నాయకులు పేట్రేగిపోతున్నారు. ఖాళీ స్థలాలపై కన్నేసి, కబ్జాలకు దిగుతున్నారు. రైతు ఆధీనంలో ఉన్న భూమిని వదలాలంటూ వైసీపీ నాయకుడు బెదిరింపుల పర్వానికి తెరలేపాడు. పెనుకొండ మండలం చిన్నప్పరెడ్డిపల్లికి చెందిన బాధిత రైతు కురుబ వీరజిన్నప్ప గురువారం మీడియా ముందు గోడు వెల్లబోసుకున్నాడు. గ్రామ పరిధి సర్వే నంబరు 786-2లో 1987లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రభుత్వం భూమి సేకరించి, ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేసింది. వీరజిన్నప్పకు కూడా స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నారు. ఇంటి వెనకాలే ఉన్న దాదాపు 5 సెంట్ల ప్రభుత్వ భూమిని చదును చేసుకుని, అందులో గడ్డివాము, పశువుల పాక వేసుకున్నాడు. దీనిపై మండలంలోని అమ్మవారిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు బోడప్పగారి వెంకటరెడ్డి కన్ను పడింది. ఆ భూమి తమదేనని తప్పుడు పత్రాలు సృష్టించాడు. తన స్థలం ఇతరులకు విక్రయించాలనీ, పశువులకొట్టం తొలగించుకోవాలని రోజూ ఇంటి వద్దకొచ్చి వెంకటరెడ్డి బెదిరిస్తున్నాడని రైతు ఆవేదన చెందుతున్నాడు. రెవెన్యూ అధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ భూవివాదంపై తహసీల్దార్ ఉదయశంకర్ రాజ్‌ను అడగ్గా.. స్థల వివాదంపై తమకు ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు చేస్తే రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.


నమిత షో!

సినీ హీరోయిన్ నమిత ధర్మవరంలో గురువారం సందడి చేశారు. ఉమ్మడి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌కు మద్దతుగా రోడ్‌షో చేపట్టారు. నమిత రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు. సాయంత్రం గాంధీనగర్‌లోని చౌడేశ్వరి ఆలయంలో నమిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభించారు. గాంధీనగర్, శ్రీదేవి థియేటర్, అంజుమన్‌సర్కిల్, తేరుబజారు, ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, పాత మున్సిపల్ కార్యాలయం, కేపీటీ స్ట్రీట్, దిమ్మిల్‌సెంటర్ మీదుగా కదిరిగేటు వరకు సాగింది. ఆమెకు అడుగడుగునా పూలమాలలతో పట్టణవాసులు స్వాగతం పలికారు. దారుల వెంబడి జనం నిలబడి ఆమె రోడ్‌షోను వీక్షించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఆమె ముందుకు సాగారు. జనం కూడా ఆమెకు అభివాదంతో మద్దతు పలికారు. నమిత మాట్లాడుతూ.. ధర్మవరం ఓటర్లు చైతన్యవంతులనీ, అభివృద్ధి చేసే సత్యకుమార్‌ను గెలిపిస్తే అన్నివిధాలా అభివృద్ధి చేస్తారన్నారు. -ధర్మవరం





రోడ్‌షో నిర్వహిస్తున్న సినీనటి నమిత



ఖద్దరంటే ఓ రీవీ..!

దర్పం ప్రదర్శిస్తున్న నాయకులు

ఎవరైనా ఖద్దరు డ్రస్ వేసి ఉంటే అతడు రాజకీయ నాయకుడని చెబుతారు. ఎందుకంటే ఆ ఖద్దర్ దుస్తులను గంజిపెట్టి, పాలిష్ చేయడంతో ధరించినవారిని నలుగురిలో ప్రత్యేకంగా నిలుపుతాయి. ఎన్నికల సమయంలో అయితే చిన్నా చితక కార్యకర్తలు సైతం ఖద్దర్‌ని ధరిస్తుంటారు. ప్రస్తుతం ఖద్దర్‌తో పాటు లెనిన్ దుస్తులను రాజకీయ నాయకులు అధికంగా ధరిస్తుంటారు. ఎన్నికల సమయంలో ఖద్దర్ దుస్తులు ధరించి నిగనిగలాడే బూట్లు, వీలైతే చేతికి బంగారు బ్రేస్‌లైట్, ఉంగరాలు, చేతిలో ఖరీదైన ఫోన్, బ్రాండెట్ కళ్లద్దాలతో కనిపిస్తారు. కొందరు నాయకులు కుదిరితే అందరి సమక్షంలో కారులోంచి దిగి దర్పం ప్రదర్శిస్తారు. ఇది అందరు నాయకులకు వర్తించనప్పటికీ కొందరు నాయకులు మాత్రం తగ్గరు. ఎన్నికలు ముగిసేవరకు అద్దెకార్లతో పనులు కానిస్తున్నారు. అయితే ఇవికూడా ఎందుకులే అనుకుంటున్న నాయకులు, కార్యకర్తలు మాత్రం ఖద్దర్ దుస్తులు కుట్టిస్తున్నారు. దీంతో వస్త్ర దుకాణాల్లో ఖద్దర్, లెనిన్ దుస్తుల విక్రయాలు పెరిగాయి. అదే సమయంలో టైలర్లకు కూడా గిరాకీ పెరిగింది. రెడీమెడ్ దుకాణాల్లో కూడా ఈ దుస్తుల విక్రయాలు పెరిగినట్లు పేర్కొంటున్నారు. గ్రామస్థాయి నాయకులు కూడా ప్రచారాలకు వెళ్లేటప్పుడు ఖద్దరు చొక్కాలను వేస్తూ దర్పం ప్రదర్శిస్తున్నారు. **- హిందూపురం**

పేదల నీటికి గండి..!

ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ మూసివేత

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం పంచాయతీ కేంద్రాలలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ పథకం ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలు రెండు రూపాయలకే బిందె నీటిని ఈ ప్లాంట్ల నుంచి తెచ్చుకున్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ వాటర్ ప్లాంట్‌లు మూతపడ్డాయి. మండలం లోని కళ్లహాళ, గోవిందవాడ, ఉప్పరహాళ్ తదితర పంచాయతీలలో సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను మూసివేశారు. ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ ఆధీనంలోకి మినరల్‌వాటర్ ప్లాంటును తీసుకొని ఇతర గ్రామాలకు ఆటోల్లో తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

- బొమ్మనహాళ్



మూతపడిన వాటర్ ప్లాంట్

ఒక్క ఓటు తేడాతో..



కదిరి అర్బన్, మే 2: నా ఒక్క ఓటు వేయకుంటే ఏమవుతుందిలే, అని చాలా మంది అనుకునేవారుంటారు. అయితే ఒక్క ఓటు తేడాతో ఎన్నికల్లో అభ్యర్థులు ఓడిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ముఖ్యమంత్రి పీఠాన్ని కోల్పోయిన నేతలున్నారు. ఒక్కఓటు ఎన్నో ఫలితాలను తారుమారు చేసిన సందర్భాలు అనేకం. సాధారణ ఎన్నికల నుంచి గ్రామ పంచాయతీకి నిర్వహించే ఎన్నికల వరకు అన్ని ఎంతో కీలకమైనవి.

- 2004 కర్ణాటకలోని సంతేమరహళ్లి నియోజకవర్గ నుంచి జేడీఎస్ నుంచి పోటీ చేసిన ఏఆర్ కృష్ణమూర్తి ఒక్క ఓటు తేడాలో ఎమ్మెల్యే సీటు కోల్పోయారు. ఎన్నికల రోజు ఓటు వేయాలనుకున్న తన డ్రైవర్‌కు ఏఆర్ కృష్ణమూర్తి సమయం ఇవ్వకపోవడంతో ఆయన ఓటు వేయలేకపోయినట్లు తరువాత కథనాలు వెలువడ్డాయి.

సీఎం చాన్స్ గల్లంతు

రాజస్థాన్‌లో 2008 శాసనసభ ఎన్నికల్లో నాత్‌ద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున సీపీ జ్యోషి, బీజేపీనుంచి కళ్యాణ్‌సింగ్‌చౌహాన్ పోటీ చేశారు. ఫలితాల్లో ఒక్కఓటు తేడాతో చౌహాన్ గెలుపొందారు. జ్యోషి తల్లి, సోదరి, డ్రైవర్ ఎన్నికల రోజు ఓటు వేయడానికి వెళ్లలేదు. ఈ ముగ్గురు ఓటు వేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎన్నికల్లో జ్యోషి రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగానే కాకుండా సీఎం రేసులో ముందున్నారు. పార్టీని విజయపథంలో నడిపించినా, ఒక్క ఓటుతో ఓడిపోవడంతో సీఎం అయ్యే అవకాశం కోల్పోయారు. వారి మూడు ఓట్లు పడి ఉంటే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయ్యేవారేమో. ఒక్క ఓటు విలువ ఎంతో చెప్పేందుకు ఇవే నిదర్శనం.



జగన్ మామ మోసం..!



విద్యార్థులకు రూ.300 కోట్లు బాకీ

ఉత్తుత్తి బటన్ నొక్కి విడుదల చేసినట్లు ప్రకటనలు

విద్యా, వసతి డబ్బుల కోసం ఎదురుచూపులు

నాలుగేళ్లలో ఇచ్చింది రెండేళ్లకే..

సొంతంగా ఫీజు కట్టుకుంటున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 2 : 'మీ పిల్లలకు మేనమామగా నేనే చదివిస్తా.. ఫీజులు మొత్తం చెల్లిస్తా' అని బాకాలూదిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి.. తన పాలనలో విద్యార్థులకు సుమారు రూ.300 కోట్లు బాకీపడ్డారు. విద్యా వసతి దీవెన పథకాల పేరుతో ఉత్తుత్తి బటన్లు నొక్కి ఏ ప్రభుత్వం చేయలేని మేలును తానే చేశానంటూ ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం చెల్లించిన ఫీజులను లెక్కలేసి అంతకంటే రెట్టింపు ఇచ్చానంటూ గొప్పలు చెప్పారు. తమ ప్రభుత్వమే విద్యార్థులను ఉచితంగా చదివిస్తూ ఫీజులు చెల్లిస్తుందని నమ్మించారు. వాస్తవానికి తమ కష్టార్జితంతో కళాశాలలకు ఫీజులు కట్టి పిల్లలను చదివిస్తున్నామని, జగన్ సొంతడబ్బా కొట్టుకున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చెల్లించింది రెండేళ్లకు మాత్రమేనని.. అదీ ఆరొకరగా ఇచ్చి చేతులు దులుపుకుందని వాపోతున్నారు. 2023-24లో నొక్కిన బటన్లు ఏమైయ్యాయని.. ఆ డబ్బులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నిస్తున్నారు.

ఉత్తుత్తి బటన్ నొక్కుడు..

జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో కన్వీనర్ కోటా ద్వారా దాదాపు 1.20 లక్షల మంది బీటెక్, 15వేల మంది బీఫార్మసీ, 50వేల మంది డిగ్రీ కోర్సులు అభ్యసిస్తున్నారు. 12వేల మంది పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్నారు. వీరందరూ విద్యాదీవెన, వసతి దీవెన పథకాల అర్హులు. బీటెక్, బీఫార్మసీ నాలుగు సంవత్సరాలు. డిగ్రీ, పాలిటెక్నిక్ కోర్సులు మూడేళ్ల చొప్పున చదవాలి. ప్రతి ఏటా ఫీజులు మొత్తాల చెల్లింపు పూర్తిచేస్తేగాని కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు రాయనీయవు. జగన్ మాత్రం సంవత్సరంలో నాలుగుసార్లు ఉత్తుత్తి బటన్ నొక్కుతున్నారని మండిపడుతున్నారు.

ఫీజు మొత్తాల్లోనూ వివక్ష..

గత టీడీపీ ప్రభుత్వం విద్యార్థులు చదువుతున్న కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించేది. విద్యార్థుల వివరాలను జోడించి వారి పేరుతో కళాశాల ఖాతాలకు జమచేసేది. బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ, పాలిటెక్నిక్.. ఇలా కోర్సులను బట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాన్ని కళాశాలలకు జమచేసేది. కళాశాలలపై కక్షకట్టిన జగన్.. ఒక్కో కళాశాలకు ఒక్కోవిధంగా ఫీజులు నిర్ణయించారు. బీటెక్‌లో.. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు రూ.43వేల నుంచి రూ.77వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్, కాన్‌స్టిట్యూయెంట్ కళాశాలలకు రూ.10వేల నుంచి రూ.37వేల వరకు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు, ప్రైవేట్ యూనివర్సిటీలకు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు కన్వీనర్ కోటాకింద ఫీజులను నిర్ణయించారు. బీఫార్మసీలో.. ప్రైవేట్ కళాశాలలకు రూ.38వేల నుంచి రూ.65వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలకు రూ.10వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.35వేల నుంచి రూ.50వేలుగా చేశారు. డిగ్రీ కోర్సుల్లో.. ఆర్ట్స్‌కు రూ.4,175నుంచి రూ.11వేల వరకు, సైన్స్‌కు రూ.4,875నుంచి రూ.16వేల వరకు నిర్ణయించారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో.. ప్రభుత్వ కళాశాలకు రూ.4,700, ప్రైవేట్ కళాశాలలకు రూ.25వేలుగా నిర్ణయించారు.

కన్వీనర్ కోటాలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను విద్యా దీవెన, వసతి

రూ. 300 కోట్ల ఎగనామం

దీవెన కింద దాదాపు రూ.300కోట్లు ఎగనామం పెట్టారని విద్యార్థులు, అధికార వర్గాలు మండిపడుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఒక్కపైసా చెల్లించలేదని వాపోతున్నారు. తాజాగా నొక్కిన బటన్ ద్వారా ఏ విద్యార్థి తల్లి ఖాతాలో కూడా నగదు జమకాలేదని మండిపడుతున్నారు. హాస్టల్‌లో వసతి పొందేందుకు సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీనిచ్చి రూ.10వేలకు కుదించారని వాపోతున్నారు. అందులోనూ నాలుగేళ్లకు రెండు సంవత్సరాలు ఎగ్గొట్టారని చెబుతున్నారు. జగన్ తన సామాజికిక వర్గానికి చెందిన కళాశాలలకు ఫీజులు అధికంగా పెంచి ఆ భారాన్ని తమ మోపాడని మండిపడుతున్నారు. రాజకీయ పలుకుడి లేని కళాశాలల్లో బీటెక్ ఫీజు రూ.45వేలు అయితే ఆయన వర్గానికి చెందిన కళాశాలల్లో రూ.77వేలు నిర్ణయించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

అబద్ధపు మాటలతో పేదలను నమ్మించి మోసం చేయ

మోసానికి మారుపేరు జగన్



డం లో జగన్‌కు తిరుగులేదు. జేఎన్‌టీయూ, ఎస్కేయూలో పరిధిలో కన్వీనర్ కోటాకింద దాదాపు రెండు లక్షల మందికి విద్యాదీవెన, వసతి దీవెన డబ్బులు మంజూరు చేయాలి. నాలుగేళ్లలో రూ.300 కోట్లకు పైగా జగన్ బాకీపడ్డారు. వసతి దీవెన కింద ఏడాదికి రూ.20వేలు ప్రకటించి రూ.10వేలకు కుదించారు. అదికూడా ఇవ్వకుండా మోసం చేశారు.

సంవత్సరంలో నాలుగుసార్లు బటన్

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఏడాదికి ఒకసారి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సీఎం జగన్‌రెడ్డి నాలుగుసార్లు బటన్ నొక్కుతున్నాడు. డిగ్రీకి రూ.4వేలు, ఇంజనీరింగ్‌కు రూ.10వేలు ఇలా చిన్నచిన్న మొత్తాలను నాలుగు సార్లు విడుదల చేయడంతో వచ్చే వెయ్యి, రెండువేలు ఖర్చులకే సరి పోతుంది. కళాశాలలకు ఎప్పుడు కట్టాలి. నాలుగేళ్లలో రెండు సంవత్సరాలు మాత్రమే ఫీజులు చెల్లించి మిగిలిన డబ్బులు బాకీపడ్డారు. రూ.20వేల నుంచి రూ.70వేలు ఫీజులున్న కళాశాలలకు పేద విద్యార్థులు ఎలా చెల్లిస్తా రు?. జగన్ ఇంటికి పోయే సమయం దగ్గరపడటంతో చేతులెత్తేశాడు.

పనికెళ్లి ఫీజులు కడుతున్నా...



విద్యా దీవెన డబ్బులు రాకపోవడంతో ఊర్లో కూలిపనుకెళ్లి కళాశాల ఫీజులు కడుతున్నాను. చదువులు ఉచితమని ప్రభుత్వం చెబుతున్నా ఫీజులు ఇవ్వడంలేదు. సంవత్సరంలో రెండు సెమిస్టర్ పరీక్షలు రాయాలి. ఫీజులు కట్టకుంటే పరీక్షలు రాయనీయరు. వసతి దీవెన రూ.10వేలు కూడా రాలేదు. నాలాంటి చాలామంది పేద విద్యార్థులు డిగ్రీ చదువుతున్నా సెలవు రోజుల్లో కూలి పనులకెళ్లి ఫీజులు కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్పందించి ఫీజు మొత్తాలను విడుదలచేయాలి.

- జయలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని

విద్యా, వసతి దీవెనలు అందలేదు



ప్రభుత్వం చెల్లిస్తామన్న విద్యా, వసతి దీవెన డబ్బులు అందలేదు. సీఎం జగన్.. బటన్ నొక్కుతూనే తల్లుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పినా నేటికీ రాలేదు. దీంతో అమ్మ, నాన్న కూలి పనుకెళ్లి వచ్చిన డబ్బులతో ఫీజులు కడుతున్నాం. డిగ్రీ పూర్తిచేసి బీఈడీ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తే టీచర్ పోస్టు సంపాదించవచ్చు. డిగ్రీ చదవాలంటేనే ప్రభుత్వం ఫీజులు ఇవ్వడంలేదు. ఇలాగైతే బీఈడీ ఎప్పుడు పూర్తిచేయాలి. టీచర్ పోస్టు ఎలా సాధించాలి.

-సాప్రియా, డిగ్రీ విద్యార్థిని



మెళవాయిలో పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం

ఏళ్లు గడిచినా... అంతేనా ?

నేటికీ పూర్తికాని సచివాలయ భవన నిర్మాణాలు



ఆమిదాలగొందిలో ఆగిపోయిన భవన నిర్మాణం

మండలంలో 18 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇంకా కొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాల కోసం రూ.8.10 కోట్లతో పనులు చేపట్టారు. ఒక్కో సచివాలయ భవనానికి రూ.45 లక్షలు విడుదల చేశారు. మొదటి విడతలో నిధులు బాగా విడుదల కావడంతో పనులు ఎంతో ఉత్సాహంగా చేపట్టారు. రెండో విడుతకు నిధులు విడుదల కాకపోవడంతో చాల భవనాలు లింటిల్, టాప్‌లెవల్ వరకు వచ్చి నిలిచిపోయాయి. మెళవాయి గ్రామ సచివాలయం పునాదులకై పరిమితమైంది. నిధుల కొరతతో ఏళ్ల గడుస్తున్నా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. అందుకే సచివాలయాల నిర్వహణ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు, మహిళా సంఘాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు.

- మడకశిర రూరల్

కేతిరెడ్డి సారు చెప్పారు.. ప్రచారానికి రండి..!

సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు వైసీపీ కౌన్సిలర్ హుకుం

ధర్మవరం, మే 2: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా ప్రచారానికి రావాలని అధికార పార్టీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ ఆదేశించిన వాయిస్ మెసేజ్ వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తోంది. 'ఎమ్మెల్యే కేతిరెడ్డి సార్ చెప్పారు.. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎన్నికల ప్రచారానికి ఉదయం 6గంటలకంత లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న మన కాంప్లెక్స్ వద్దకు రావాలి..' అని వాట్సాప్ ద్వారా పంపిన మెసేజ్ అన్ని గ్రూపుల్లో వైరల్‌గా మారింది.

ఊరుకిచ్చిన మాట గుర్తుందా..?

అనంతపురం రూరల్

అప్పుడెప్పుడో ఎన్నికల ప్రచారానికి మా ఊరికొచ్చావ్. ఎన్నో హామీలిచ్చావ్. గెలిస్తే గ్రామానికి వచ్చి వెళ్లే ప్రధాన రోడ్డు వేస్తానన్నావ్. గ్రామానికి రోడ్లు, కాలువలు, నీళ్లు ఇస్తానన్నావ్. నిజంగా పనులన్నీ చేస్తావేమోనని మేమంతా సంబరపడ్డాం. పోలింగ్ రోజు ఎగబడి ఓట్లు వేశాం. గెలిచావ్. ఆనక కనిపించకుండా పోయావ్. ఎమ్మెల్యేగారు..! అసలు మా ఊరంటూ ఒకటి ఉందని గుర్తుందా? అని ఆ ఊరి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదెక్కడి పాలనో? ఈయనేమీ పాలకుడో అంటూ ఈసడించుకుంటున్నారు. ఇదీ రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం, ఆలమూరు పంచాయతీ పరిధిలోని ఎం.బీ.పల్లి గ్రామస్థుల ఆవేదన. గ్రామం ఏమైనా మారుమూల ప్రాంతంలో ఉందా అంటే అదీ కాదు. అనంతపురం-ఆలమూరు రోడ్డు నుంచి గ్రామానికి 4.5కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. టీడీపీ హయాంలో దాదాపు రూ.1.9కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రోడ్డు వేసేందుకు మట్టి పనులు పూర్తి అయ్యాయి. ఊళ్లో నుంచి అర్ధబాగం చిన్న సైజు కంకర కూడా వేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పాలకులు రోడ్డు సమస్యతో పాటు గ్రామంలోని సమస్యలు అలానే వదిలేశారు. ఐదేళ్ల కాలంలో పాల కులు గ్రామానికి వెళ్లింది కానీ స్థానిక సమస్యలు చర్చించి..వాటి పరిష్కారానికి ఒక్క పైసా ఖర్చు చేసిన దాఖలు లేవని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. ఏడాది కిందట కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్డు గుంతలు జలమయమైపోయాయి. దీంతో గ్రామస్థులే గుంతలు పూడ్చుకున్నారు. అయినా రోడ్డు నిర్మాణం జరగలేదు. స్థానిక ప్రజాప్రతినిధి తరచూ తన సొంత గ్రామానికి ఆలమూరు ప్రధాన రోడ్డుపైనే ప్రయాణం సాగిస్తున్నారు. అప్పుడైనా మా గ్రామానికి ఇచ్చిన మాటలు ఆయనకు గుర్తుకురాకపోవడం తాము చేసుకున్న పాపమని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు మరచిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎంబీపల్లికి ఐదేళ్లలో పైసా ఖర్చుచేయని దుస్థితి



కంకరతేలిన ఎంబీ పల్లి రోడ్డు

అయినా అభివృద్ధిని మాత్రం పాలకులు విస్మరించారు. గ్రామంలో ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదంటే అభివృద్ధి ఏమేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మండలంలోని సమస్యలే ఇలా పరిష్కరిస్తున్నారంటే ఇక దూరంగా ఉన్న ప్రాంతాల్లోనే సమస్యలు ఎలా రూపుమాపుతున్నారో ఆ పాలకులకే తెలియాలి.

సమస్యలు పట్టించుకునేదెవరు ?

గ్రామంలో ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీలున్నాయి. దాదాపు 80 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామం చిన్నదే అయినా సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం ప్రధాన సమస్య.



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు కాలువ

టీడీపీ హయాంలోనే అభివృద్ధి



గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చూసిందే లేదు. అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే జరిగింది. అప్పట్లో కొంత వరకు సీసీరోడ్ల నిర్మాణం జరిగింది. గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు కూడా ప్రారంభమైంది. అయి తే ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

- వీరాంజనేయులు, ఎంబీపల్లి

ఇబ్బందుల ప్రయాణం



గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలు పడింది. కంకర తేలింది. దీంతో ఆలమూరు రోడ్డు-అనంతపురం ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి ప్రయాణం చేయాలంటే అరగంట పడుతోంది. పాలకులు వచ్చి హామీలు ఇవ్వడమే తప్పా.. రోడ్డు నిర్మాణం చేసింది లేదు. మా సమస్య తీరింది లేదు.

- బాలకృష్ణ, ఎంబీపల్లి

అలా ఇచ్చి... ఇలా దోపిడీ

ధర్మవరం

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో ఆటోవాలాలకు ఆర్థిక కష్టాలు తప్పడంలేదు. ఏదో ఆదుకుంటాడనుకుంటే ఉన్నది లాగేసుకుంటున్నాడని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గోరంత సాయం చేసి కొండంత లాక్కోవడంపై ఆటో వర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి ఆటో కార్మికులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసినట్టు చేసి అంతే స్థాయిలో వారి నుంచి వివిధ రూపాల కింద రెట్టింపు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లాలో 30వేలకు పైగా ఆటోలు ఉండగా అందులో నగం మందికి కూడా ఆర్థిక సాయం అందడం లేదు. జరిమానాలు, రోడ్డు టాక్స్ సీఎన్‌జీ రూపంలో వసూలు చేస్తూ ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.130 జరిమానా విధిస్తే జగన్‌రెడ్డి రూ.1030 జరిమానా పెంచడంపై మండిపడుతున్నారు. ఏడాదిలో 10-15 సార్లు పని కట్టుకుని జరిమానాలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. అదే విధంగా రోడ్డు టాక్స్, సీఎన్‌జీ వంటి టాక్స్‌లు కూడా భారీగా పెంచడంపై ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్మంతా జరిమానాలకే సరిపోతోందని, ఇక తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వాపోతున్నారు.



వరకు లాగేస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక కష్టాలు

వాహన మిత్రతో ఒరిగింది శూన్యం

ఏటా ఇచ్చేది రూ.10వేలు

జరిమానాలు, సీఎన్‌జీ, పన్నుల పేరుతో రెట్టింపు వసూలు

పన్నులు, పర్మిట్లతో గుంజుడే గుంజుడు

ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలాలు మొత్తుకున్నా వినలేదు. పన్నును అమాంతంగా పెంచేశారు. పదిహేనేళ్ల కాల పరిమితి దాటిన వాహనాలకు విధించే ఈ పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలాలు కోరినా వినలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది జగన్ ప్రభుత్వం. ఇలా సగటున ఒక్కో ఆటోవాలాకు ఏడాదికి రూ.10వేలకు పైగానే అదనపు భారం పడుతోంది.

సీఎన్‌జీ బాదుడు మరోలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర రూ.55గా ఉంది. ప్రస్తుతం రూ.85కు చేరింది. ఏటా రూ.5,రూ.10,రూ.15 మేర పెరుగుతూ వస్తోంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనుకేసుకుందాం అనుకునే ఆటోవాలాలకు భారంగానే మారింది. రోజూ సగటున 200 నుంచి 250కిలోమీటర్ల వరకు నడుపుతారు. ఇందుకు 6 కిలోల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ.30తో రోజుకు రూ.180 చొప్పున నెలకు రూ.5400 అదనపు భారం పడుతోంది. ఏడాదికి రూ.64,800 భారమవుతోంది. సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తోంది. ఈ ప్రకారం ఒక్కో ఆటో వాలా నుంచి ఏడాదికి రూ.2160 అదనంగా తీసుకుంటోంది.

జగన్ సర్కారుకు తగిన సమయంలో తగిన మూల్యం చెల్లిస్తామని ఆటో కార్మికులు బాహాటంగా చెబుతున్నారు.

జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక జరిమానాలు భారీగా పెరిగాయి. టీడీపీ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.130 జరిమాన విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ట ధర రూ.1030 అయింది. ఏకంగా పది రెట్లు పెరిగిందన్న మాట. ఏడాదికి 10 నుంచి 15 వరకూ జరిమానాలు విధిస్తున్నారు. ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో దాదాపు రూ.10వేల


ఆటోలను అమ్ముకోవాల్సిందే



గత టీడీపీ హయాంలో జరిమానాలు తక్కువగా ఉండేవి. రోజంతా కష్టపడితే కనీసం రూ.500 మిగిలేది. నాకు రెండు ఆటోలుండేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు, ఇతర పన్నులు పెరగడం వల్ల ఒక ఆటో అమ్మేశాను. పైగా రోజంతా ఆటో నడిపితే ఏమాత్రం మిగిలలేని పరిస్థితి.

రాజేశ్, ఒలిమిచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదు



ఆటో డ్రైవర్లకు వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీలేదు. వాహన మిత్ర కింద రూ.10వేలు ఏడాదికి ఇస్తున్నమాట వాస్తవమే. ఆ రూ.10వేలు జరిమానాల రూపంలో లాగేసుకుంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు తనిఖీలు చేయడం జరిమానాలు విధిస్తున్నారు. కుటుంబ పోషణ భారమైంది.

- రవి, కోడేకండ్ల, బత్తలపల్లి మండలం

ఏమి చేశారని ఓటడుగుతున్నారు..?


వైసీపీ నాయకులను ప్రశ్నిస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఐదేళ్ల పాలనలో మా కాలనీకి ఏమి చేశారని ఓటడుగుతున్నారని బెళుగుప్ప ఎస్సీ కాలనీవాసులు గురువారం వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కాలనీలో డ్రైనేజీ అధ్వానంగా ఉంది. రోడ్లపైనే మురుగు నీరు పారుతోందన్నారు. ఒక్క ఇంటి పట్టా ఇచ్చారా అని నిలదీశారు. కాలనీలో వైసీపీ నాయకులు గడపగడపకు సంక్షేమం ప్రచారం నిర్వహిస్తుండగా కాలనీవాసులు తిప్పేస్వామి, భైనే నారాయణ స్వామి, శ్రీరాములు, సూరీ, రాజేష్, లోకేష్, అనిల్ తదితరులు నాయకులతో సమస్యలు తెలిపారు. మురుగు నీటి దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నామని తెలపగా వారిపై వైసీపీ నాయకులు మండిపడ్డారు.

- బెళుగుప్ప

ఆగిన అమూల్ డెయిరీలు


గాండ్లపెంటలో అర్థంతరంగా ఆగిన అమూల్ పాల డెయిరీ నిర్మాణాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల డెయిరీలు నిర్మిస్తామని ఎంతో గొప్పగా చెప్పినా, నిధులు కొరతతో మండల వ్యాప్తంగా పలు దశాల్లో అమూల్ పాల డెయిరీల నిర్మాణాలు నిలిచిపోయాయి. మండలంలో పాల డెయిరీలు 19 నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. ఈడెయిరీల ద్వారా పాడిరైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని చెప్పారు. రెండేళ్ల కిందట పునాదులు వేసి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. ఒక్కొక్క డెయిరీ నిర్మాణానికి రూ.15లక్షలకు పైగా నిధులు అంచనా వేశారు. అయితే ఈమొత్తం సరిపోకపోవడంతో పలు డెయిరీల నిర్మాణాలు నిలిచిపోయాయి. మరికొంత పెంచుతామని అధికారులు చెప్పినా ఆయా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. దీనిపై వివరణ కోరడానికి పీఆర్ జేఈ రెడ్డిప్రసాద్‌ను ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

- గాండ్లపెంట

వలంటీర్.. ఆన్ ఎలెక్షన్ డ్యూటీ..


కోటూరులో ఓటరు స్లిప్పులు సరిచూస్తున్న వలంటీర్

తనకల్లు మండలం కోటూరులో వలంటీర్‌గా పని చేస్తున్న శ్రీలత గురువారం బీఎల్‌ఓలతో కలిసి ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. గ్రామంలోని ఓ ఇంటిలో కూర్చొని ఓటరు స్లిపులను, జాబితాతో సరిచూసి పంపిణీలో పాల్గొన్నారు. ఈవిషయంపై బీఎల్‌ఓ నాగరాణిని విలేకరులు ప్రశ్నించగా వలంటీర్ వారి ఇంటిలోని ఓటరు స్లిప్పులను సరిచూసుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. కోటూరులోని ఓ ఇంటిలో ఓటరు స్లిపులు సరిచూస్తున్న విషయాన్ని గ్రామానికి చెందిన ఓవ్యక్తి వీడియో తీసి, సోషల్ మీడియాలో పెట్టారు. ఈవిషయం పెద్ద చర్చనీయాంశమైంది.

- తనకల్లు


తాడిపత్రిలో కిటకిట..

నీకిది తగునా.. మనవడా..?

- పింఛన్ లబ్ధిదారుల ఆక్రందన
- డబ్బు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు
- కొన్ని చోట్ల పాత అప్పులకు పింఛన్ సొమ్ము జమ
- ఖాతాకు ఆధార్ లింక్ లేదని వెనక్కి పంపుతున్న సిబ్బంది
- మండే ఎండలకు అల్లాడిపోతున్న లబ్ధిదారులు


అనంతపురంలోని సాయినగర్ మెయిన్ బ్రాంచ్‌లో పింఛన్ కోసం వచ్చిన ఓ వృద్ధుడు

వైసీపీ ప్రభుత్వ తీరుతో రెండో నెల కూడా సామాజిక పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. పింఛన్ డబ్బులను ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో అవ్వాతాతాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. పింఛను డబ్బు కోసం వృద్ధులు బ్యాంక్‌లు, గ్రామ సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఇన్నాళ్లు ఇంటి వద్దే పింఛన్ తీసుకున్న తమకు ఎన్నికల సాకుతో ప్రభుత్వం కొత్త చిక్కులు తెచ్చిపెట్టిందని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే ఎండలు దంచికొడుతున్నాయి. ఈక్రమంలో నగదు కోసం వెళ్లిన వృద్ధులు అల్లాడిపోతున్నారు. కొందరి ఖాతాల నుంచి లావాదేవీలు జరగకపోవడంతో వాటిని బ్లాక్ చేశారు. వాటిని రీ ఓపెన్ చేయాలంటే ఆధార్‌కార్డు, సెల్ నంబర్‌తో అప్‌డేట్ చేయించుకోవాలని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. అయితే చాలా ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోవడం వలన బ్యాంక్ మినీ సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఆధార్ అప్‌డేట్ కోసం రెండు రోజుల పాటు తిరిగాలి. ప్రతి రోజు బ్యాంక్ వద్దకు వస్తే... కనీసం రూ.300 నుంచి 500 వరుకు ఖర్చువుతోందని వృద్ధులు వాపోతున్నారు. బ్యాంక్‌ల వద్ద విత్ డ్రా ఫారాలు రాసేందుకు వెలుగు సిబ్బంది లేదా, గ్రామ సచివాలయాల సిబ్బంది కూడా కనిపించలేదు. దీంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద బ్యాంక్ విత్‌డ్రా ఫారాలు, ఆధార్‌అప్‌డేట్ ఫారాలు రాసినందుకు రూ.30 నుంచి రూ.40 ఖర్చు అవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈక్రమంలోనే ఎన్ని తిప్పలు తిప్పలు తెచ్చిపెట్టావురా జగనా అంటూ వృద్ధులు శాపనార్థాలు పెడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


తాడిపత్రిలో బ్యాంకు వద్ద లబ్ధిదారుల రద్దీ


పామిడిలోని యూనియన్ బ్యాంకు వద్ద...


కూడేరులో ఎండలో పింఛన్‌దారుల అగచాట్లు


బుక్కరాయసముద్రంలో ఆధార్ అప్‌డేట్ కోసం..


అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు ఎస్‌బీఐలో లబ్ధిదారులు

బువ్వ తినకుండా వచ్చా



ఎప్పుడూ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చే వారు. ఎలచ్చన్ వచ్చిందని పింఛన్ సొమ్ము బ్యాంకులో వేశామని చెప్పారు. బువ్వకూడా తినకుండా బ్యాంకుకు వచ్చా. ఇక్కడేమో చానామంది ఉన్నారు. ఒక పక్క ఎండ, ఇంగోపక్క కడుపులో మంట. ఇంటికిపోలేను ఈడ ఉండలేను. పింఛన్ తీసుకునేటప్పటికి పానం పోయినట్లయ్యింది.

- వడ్డేనరసమ్మ, ఎనుమలపల్లి, పుట్టపర్తి


పక్షవాతంతో బాధపడుతున్న మల్లయ్యను బ్యాంకుకు తీసుకెళుతున్న భార్య అంజినమ్మ

పదకొండునూర్లు పట్టుకున్నారు..



నెలనెలా మూడువేలు పింఛన్ ఇచ్చేవారు. ఈనెల పంతొమ్మిదినూర్లు చేతికొచ్చింది. ఏంటికి తక్కువ లెక్క ఇచ్చారని అడిగితే బ్యాంకు బుక్కులో దుడ్లు లేవని సారోళ్లు చెప్పారు. ఏంటివో సేవా చార్జీల కింద కట్ అయ్యాయంట. ఎప్పుడో వెయ్యికట్టి బ్యాంకు బుక్కు తీసుకున్నా అవి ఏమయ్యాయో తెలీదు. పింఛన్ లెక్కలో పదకొండునూర్లు పట్టుకుని ఇచ్చారు. బ్యాంకులో వేయకుండా సేతికిచ్చింటే బాగుండు. బ్యాంకుకు పోయి వచ్చేకి సాలైపాయా.

- పెద్దతిరుపాలు కర్ణాటక నాగేపల్లి, పుట్టపర్తి

ఇంటి వద్దే ఇవ్వాలి..

మా ఊరిలో బ్యాంకు లేదు. బ్యాంకు పని ఉందంటే బెళుగుప్పకు రావాల్సిందే. రాను పోను రూ. 80లు చార్జీ అవుతుంది. ఇంత కష్టపడి వస్తే పింఛన్ అకౌంట్‌లోకి జమ కాలేదంటున్నారు. ఎండలకు అల్లాడిపోతున్నాం. మళ్లీ రేపు రావాలంటే చానా ఇబ్బంది పడాల్సిందే. ఖర్చులకే దాదాపు రూ. 200లు పోతుంది. అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



చౌడక్క, లబ్ధిదారురాలు, శ్రీరంగాపురం, బెళుగుప్ప మండలం

ఎందుకు ఇవ్వరో చెప్పరు



పొద్దున్నుంచి ఈడే ఉన్నా. వేలు పెట్టి పింఛన్ డబ్బులు తీసుకుందామంటే రావన్నారు. బ్యాంకులో తీసుకోమని చెప్పారు. బ్యాంకులో అడిగితే వాళ్ల రావంటున్నారు. ఎందుకు రావో? ఎందుకు ఇవ్వరో సరిగ్గా చెప్పరు. నాలాంటి వాళ్ల చాలా మంది దుడ్లు రాక ఇబ్బంది పడుతున్నారు. సమస్య ఏమిటో ఎవరూ అర్థమయ్యేలా చెప్పడం లేదు.

- పెద్ద ఎల్లప్ప, వంకరాజుకాలువ

నాలుగు బ్యాంకులు తిరిగా

పింఛన్ సొమ్ముపై ఆధారపడి బతుకుతున్నా. నలుగురు కొడుకులు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్ సొమ్ముతోనే భత్యం తెచ్చుకుని సొంతంగా వండుకుని తింటున్నాను. పోయిన నెలలో ఇచ్చిన పింఛన్‌తో బియ్యం, ఇతర వస్తువులు తెచ్చుకున్నా. అంతా అయిపోయింది. ఈ నెలకు అవసరమైన భత్యం తెచ్చుకోవాలంటే పింఛన్ ఇంకా రాలేదు. ఇప్పటికే ఎండలో నాలుగు బ్యాంకుల చుట్టూ తిరిగా. ఇంకా పడలేదని చెబుతున్నారు. ఎండలో నడవలేక నానా అవస్థలు పడ్డా. ఆటోకి రూ.500 ఖర్చు అయిపోయింది. అయినా ఇంకా పింఛన్ అందలేదు.



- నూర్జహాన్, అనంతపురం

ఆధార్ లింక్ కాలేదని తిప్పుతున్నారు..



పింఛన్ కోసం పొద్దున్నే వచ్చా. బ్యాంక్‌లో లైన్‌లో నిలబడి డబ్బు తీసుకునేందుకు పోతే అకౌంట్‌కు ఆధార్ లింక్ కాలేదని వెనక్కి పంపించారు. ఆధార్ లింక్ ఎక్కడ చేయించుకోవాలో తెలియక ఎండలో రెండు, మూడు సార్లు తిరిగా. లింక్ చేయించుకునేందుకు, అప్లికేషన్ ఫారమ్ రాపిచ్చుకునేందుకు రూ.100 ఖర్చు అయ్యింది. ఆటో, టిఫెన్, భోజనాలకు మొత్తం ఈ రోజే రూ.400 ఖర్చు అయ్యింది. సీఎం జగన్ చాలా పొరపాటు చేస్తున్నాడు. కనీసం గ్రామ సచివాలయాల వద్ద అన్న పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకుని ఉంటే బాగుండేది.

- బయన్న, కేకే అగ్రహారం

ఎవరికీ ఈ కష్టాలు రాకూడదు



ఈ ముసలి వయస్సులో పగవాడికి కూడా ఇన్ని కష్టాలు రాకూడదు. 75 సంవత్సరాల వయస్సులో 18 కిలోమీటర్లు దూరం నుంచి వచ్చి పింఛన్ డబ్బు తీసుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. ఇక్కడికి వచ్చినాక బ్యాంక్ సిబ్బంది అకౌంట్ అప్‌డేట్‌లో లేదు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఇస్తే.. తిరిగి అప్‌డేట్ చేసేందుకు బ్యాంక్‌లోనే 2 గంటల సమయం పట్టింది. ముసలి వాళ్లను ఎన్ని కష్టాలు పెడుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి తప్పుడు నిర్ణయాలు ఇకమీదటనైనా తీసుకోకుండా ఉండాలి.

- ఎర్రిస్వామి, వెంకటాపురం

ఎలా బతకాలి..?



నాకు ప్రతి నెలా వచ్చే రూ. మూడు వేల వింతంతు పింఛనే మా కుటుంబానికి ఆధారం. ఈ నెల పింఛన్‌ను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అయితే అప్పు ఉందని బ్యాంకు అధికారులు దాన్ని పట్టుకున్నారు. ఇప్పుడు ముగ్గురు పిల్లలతో నేనెలా బతకాలి?

- లక్ష్మిదేవి, వితంతువు, సీకేపల్లి

ప్రభుత్వానికి శాపనార్థాలు

రొద్దం మండలంలోని అనేక గ్రామాల్లోని వృద్ధులు, వితంతువులకు పింఛన్ బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. గురువారం మోపర్లపల్లి, తాడంగిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు 15కి.మీ.దూరం లోని రొద్దం కెనరాబ్యాంక్‌కు అష్టకష్టాలు పడి చేరుకున్నారు. మోపర్లపల్లి గ్రామానికి చెందిన 72ఏళ్ల వృద్ధుడు మల్లయ్య పక్షవాతంతో బాధపడుతూ నడవడానికి చేతగాని పరిస్థితుల్లో భార్య అంజినమ్మ సాయంతో బ్యాంకు వద్దకు వచ్చాడు. ఆయన పరిస్థితిని చూసిన అక్కడి జనం వైసీపీ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడిందని శాపర్థాలు పెట్టారు. కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన 80ఏళ్ల వృద్ధురాలు నాగమ్మ పింఛన్ కోసం అనంతగ్రామీణ బ్యాంక్‌కు రాగా పెన్షన్ పడలేదని చెప్పడంతో ఎండలో నడవలేక బస్టాండులోని షాపువద్ద మెట్లపై కూర్చుండిపోయింది. ఇలా ఒక్కొక్కరి బాధలు ఒక్కో రకంగా ఉన్నాయి.

చంద్రబాబుపై విషప్రచారం

శింగనమల మండలంలో వైసీపీ నాయకులు సరి కొత్త విష ప్రచారానికి తెర తీశారు. సామాజిక పింఛన్లు తీసుకోవడానికి బ్యాంకుల వద్దకు వచ్చిన లబ్ధిదారులతో చంద్రబాబు వల్లే మీకు ఈ కష్టాలు వచ్చాయని దుష్ప్రచారం చేస్తున్నారు.

డబ్బును జమ చేసుకున్నారు



నాలుగేళ్ల కిందటే భూమి అమ్మేశా. అప్పుడే క్రాప్‌లోన్ మొత్తం కట్టేశా. అయినా ఇప్పుడు బకాయి ఉందని పింఛన్ డబ్బులు పట్టుకున్నారు. పింఛన్‌తోనే బతుకుతున్న నాకు ఇప్పుడు దారేదీ?

- అంకమ్మ, పెరవలి

దుష్ప్రచారం బాధాకరం



బ్యాంకులో నేను రూ.1.5 లక్షల రుణం తీసుకున్నా. రెండేళ్లుగా రెన్యువల్ చేయలేదు. ఈనెల పింఛన్ రూ.3వేలు ఖాతాలో జమ కాగానే బ్యాంకు అధికారులు పాత బకాయిలోకి జమ చేశారు. అయితే కొందరు వైసీపీ నాయకులు బ్యాంకు వద్దకు వచ్చి చంద్రబాబునాయుడు వల్లే ఇలా జరుగుతోందని దుష్ప్రచారం చేయడం బాధాకరం.

- ఓబిలేసు చిన్నజలాలపురం


కొత్తచెరువు ఏపీజీబీ వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

బ్యాంకులు కిటకిట

తమ ఖాతాల్లో జమ అయిన పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావడంతో గురువారం యాడికిలోని బ్యాంక్‌లు కిటకిటలాడాయి. పలువురు వృద్ధుల బ్యాంక్ ఖాతాలకు లాక్‌పడటంతో కొద్ది మంది పెన్షన్ లబ్ధిదారులు సొమ్మును తీసుకోలేకపోయారు. దీంతో బ్యాంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కొంతమంది వృద్ధులు తమ పింఛన్ ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయిందో తెలుసుకోవడానికి సచివాలయం వద్ద నిరీక్షించారు. మరికొందరు డబ్బు తీసుకోవడానికి బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఆశ్రయించారు. ఇదే అదనుగా కస్టమర్ సర్వీస్ పాయింట్ల వారు లబ్ధిదారుల నుంచి రూ.30 వసూలు చేశారు.


పింఛన్ జమకాకపోవడంతో రొద్దం బస్టాండు మెట్లపై కూర్చున్న వృద్ధులు


ఉరవకొండలో పింఛన్ కోసం వస్తున్న వృద్ధులు


అనంతపురం: నిలబడలేక..


అనంతపురంలోని సాయినగర్ ఎస్‌బీఐలో క్యూలో, కుర్చీల్లో ఉన్న పింఛన్ లబ్ధిదారులు

నీడ కూడా కరువే..

పింఛన్ సొమ్ము తీసుకోవడానికి బ్యాంకుకు వచ్చే లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను కొత్తచెరువు ఏపీజీబీ సిబ్బంది బేఖాతరు చేశారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉన్నతాధికారులు సైతం బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు, ప్రజలకు తాగునీటి సౌకర్యంతోపాటు నీడ కోసం షామియానాలు సైతం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీజీబీ మేనేజర్ ఆ సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో పింఛన్ డబ్బులు కోసం వచ్చిన వృద్ధులు నానా అగచాట్లుపడ్డారు. యూనియన్ బ్యాంక్ వద్ద నీడతోపాటు కుర్చీలు, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లబ్ధిదారులు ఆ బ్యాంకు వద్ద చేసిన ఏర్పాట్లు మీరు చేయరా అంటూ ఏపీజీబీ మేనేజర్‌ను ప్రశ్నించడంతో రెండు గంటల తర్వాత షామియానాను తెచ్చి నీడ కల్పించారు.

అవినీతి వైసీపీని తరిమికొడదాం: పల్లె సింధూర

పుట్టపర్తి రూరల్, మే 2: రాష్ట్రంలో అరాచక పాలనను సాగిస్తున్న వైసీపీని తరిమికొడదామని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి తండా, కమ్మవారిపల్లిలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారథిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను గెలిస్తే నియోజకవర్గానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఎక్కడా ఒక్క అభివృద్ధి పని కూడా కానరావడం లేదన్నారు. ఐదేళ్ల పాలనంతా అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలతోనే సాగిందని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అవినీతి పాలనకు చరమగీతం పాడాలని కోరారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ అర్బన్ కన్వీనర్ రామాంజనేయులు, పుడా మాజీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్తచలపతి, రత్నప్పచౌదరి, సురేషనాయుడు, మాజీ జడ్పీటీసీ చెన్నకేశవులు, నాయకులు కరణం సుబ్రహ్మణ్యేశ్వరరావు, షామీర్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని చిత్తుగా ఓడిద్దాం



బ్రాహ్మణపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూరరెడ్డి

నల్లమాడ: వైసీపీని చిత్తుగా ఓడిద్దామని టీడీపీ యువ నాయకుడు పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వేళ్లమద్ది, కొండకిందతండా పంచాయతీల్లోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఐదేళ్లలో ప్రజలను పట్టించుకోని వైసీపీని చిత్తుగా ఓడిద్దామని పిలుపునిచ్చారు. తొలుత ఆయా గ్రామాల్లో ప్రజలు, కూటమి శ్రేణులు ఆయనకు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

● నల్లమాడ మండలంలోని చౌటకుంటపల్లికి చెందిన వైసీపీ యువనాయకులు యనముల సాయినాథ్‌రెడ్డి, పరకల దీపక్, పరకల ప్రవీణ్‌కుమార్, పరకల అమరేష్ టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో వారు యువ నాయకుడు పల్లె వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారికి కిశోర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తమరెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, నాగభూషణరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

పుట్టపర్తి రూరల్: మండలంలోని కొట్లపల్లి గ్రామానికి చెందిన కుళ్ళాయిరెడ్డి, వెంకట్రామిరెడ్డి,బోయ వెంకటనారాయణ,కురాకుల బాలప్ప తదితరులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత పల్లె మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఆయన్ను సీఎం చేసుకోవడానికి అందరం సైనికుల్లా పని చేద్దామని సూచించారు. నాయకులు కంసల నారాయణ స్వామి, రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.



వేళ్లమద్దిలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న పల్లె వెంకట కృష్ణకిషోర్‌రెడ్డి



టీడీపీలో చేరిన వారితో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం: సత్యకుమార్



ముక్తాపురంలో ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న సత్యకుమార్ యాదవ్

ముదిగుబ్బ, మే2: తాము అధికారంలోకి వస్తే మండలంలోని గ్రామాలలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. మండలంలోని నల్లచెర్లోపల్లి, నలాయకుంటపల్లి, యాకర్లకుంటపల్లి, ముక్తాపురం, మంగళమడక, రామస్వామి తండా, పూజారితండా, పొడరాళ్ళపల్లి, గరుగుతండా, గుడ్డంపల్లితండా, సానేవారిపల్లి, మలకవేముల, నాగారెడ్డిపల్లి, మల్లమ్మకొట్టాల గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కమలం గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కనుక కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ముక్తాపురంలో ఆయన ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై ప్రచారం చేపట్టారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ముంపు రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తాం..

కూటమి అధికారంలోకి వస్తే గ్రామసభలు నిర్వహించి జిల్లేడుబండ ముంపు రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని సత్యకుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొడరాళ్లపల్లిలో పర్యటించిన ఆయన జిల్లేడుబండ ముంపు రైతులను ఉద్దేశించి మాటాడారు. కూటమి అధికారంలోకి వస్తే సంబంధిత అధికారులతో గ్రామసభలు నిర్వహించి పరిహారం, పునరావాసం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేసేలా చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ పేదలకు ఎన్నో హామీలు ఇచ్చి.. ఏవీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయన్నారు. వాటి వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. తర్వాత ముక్తాపురం తండాకు చెందిన 20 కుటుంబాల వారు సత్యకుమార్ సమక్షంలో బీజేపీలోకి చేరారు.

కూటమి గెలుపునకు సమష్టిగా పనిచేయండి

తాడిమర్రి: టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమష్టిగా పని చేసి కూటమి అభ్యర్థిని గెలిపించుకుందామని బెంగళూరులోని రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కూటమి కార్యాలయంలో గురువారం ఆయన మండల నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు గోనుగుంట్ల భూషణ్, గోపాల్‌రెడ్డి, ముంటిమడుగు హర్ష, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి 25 కుటుంబాల చేరిక



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పిన పరిటాలశ్రీరామ్

ధర్మవరంరూరల్, మే2: మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో గురువారం వారు పరిటాల శ్రీరామ్‌ను కలిసి ఆయన సమక్షంలో చేరారు. శ్రీరామ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. చేరిన వారిలో కొండారెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, ఎన్ శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

ఓబుళదేవరచెరువు: మండలంలోని మామిళ్లకుంట్లపల్లిలో గురువారం టీడీపీ నాయకుడు ఎద్దుల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. పల్లె వారికి కండువాలు వేసి, ఆహ్వానించారు. చేరినవారిలో వై. నరేంద్రరెడ్డి, రెడ్డిపల్లి రమాదేవి, నర్సిరెడ్డి, ఆంజన్‌రెడ్డి, మునీంద్ర, చిన్నగంగన్న, పెద్ద గంగన్న, అరవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఓ, ఓపీఓలుగా ఆలస్యంగా ఉత్తర్వులు

● పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై ఆందోళన

కొత్తచెరువు, మే 2: ప్రభుత్వం ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు ఉపయోగించుకుంటోంది. అందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు మొదటి విడత కింద ఎన్నికల నిర్వహణపై శిక్షణ సైతం ఇచ్చారు. ఇదిలా ఉండగా శిక్షణ పొందని ఉపాధ్యాయులకు పీఓ, ఓపీఓలుగా ఉత్తర్వులు గురువారం మధ్యాహ్నం ఆలస్యంగా వచ్చాయి. కనగానపల్లి మండలం మద్దెలచెరువులోని జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ ఉత్తర్వులు వచ్చాయి. ఆ ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అనంతపురం జిలాకేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. అయితే పారం-12 సమయం 1వతేదీకి దాటిపోయిందని తెలపడంతో వారు ఆందోళనకు గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా రెండోవిడత కింద ఎన్నికల విధులకు అదనంగా కొంతమందిని తీసుకున్నారు. వారిని ఎన్నికల నిర్వహణకు పాల్గొనాలంటూ ఉత్తర్వులు 30వతేదీ పోస్టు చేశారు. అయితే ఆ ఉత్తర్వులు వారికి ఆలస్యంగా అందడంతో సమస్య ఎదురైంది. ఈ విషయాన్ని ధర్మవరం ఆర్వో వెంకటశివరామిరెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా.. ఎన్నికల విధులకు రెండో విడత కింద కలెక్టర్ తీసుకున్నారన్నారు. వారు ఎక్కడ ఎన్నికల విధులు నిర్వహిస్తారో అక్కడ పోస్టల్ బ్యాలెట్ తహసీల్దార్ కార్యాలయంలోకానీ, ఎన్నికల నిర్వహణ అధికారికి అందజేసి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఎద్దులవాండ్లపల్లి తండాలో తాగునీటి ఎద్దడి

● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

● ట్యాంకర్ల ద్వారా అయినా సరఫరా చేయాలని వేడుకోలు



ఎద్దులవాండ్లపల్లిలో అడుగంటిన బోరు

నల్లమాడ, మే 2: మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండాలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ట్యాంకర్ల ద్వారానైనా నీరుసరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలోని పంచాయతీ బోరులో భూగర్భజాలు అడుగంటి పోవడంతోనే సమస్య నెలకొందంటున్నారు. గుక్కెడునీటికోసం పడరాని పాట్లు పడుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నట్లు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సచివాలయ అధికారులను, సర్పంచ్‌కు విన్నవించామని, ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. నెలరోజులనుంచి ఇబ్బందులు పడుతున్నా, అధికారులు స్పందించడం లేదంటున్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలంటున్నారు. లేకపోతు నూతన బోరు వేసి సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం: కందికుంట



మండెంవారిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట, మే 2: చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మండెంవారిపల్లి, పల్లెనివారిపల్లి, గంగినాయునివారిపల్లి, ఎర్రవంకవారిపల్లి, మరికొమ్మెదిన్నె గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల ప్రజలు, కూటమి శ్రేణులు గజమాలలు వేసి, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. తర్వాత ఆయన ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి గెలిస్తే చంద్రబాబు సీఎం అవుతారని, ఆయనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యంగా సూపర్‌సిక్స్ పథకాల వల్ల ఎంతోమందికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట మండలంలోని మరికొమ్మెదిన్నె గ్రామంలో 20 ముస్లిం కుటుంబాల వారు టీడీపీ లోకి చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఇంటింటా ప్రచారం

కదిరి: పట్టణంలోని 9, 10, 11 వార్డుల్లో కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే ఆ పథకాలను అమలుచేస్తారని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాల వల్ల కుటుంబంలోని అందరికీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 9వార్డు ఇన్‌చార్జి రిజ్వాన్, 10వవార్డు ఇన్‌చార్జి దిల్‌దార్, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కదిరి పట్టణంలోని 34వ వార్డులో కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే చేపట్టే సంక్షేమ పతకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కందికుంటను ఆదరించాలని, ఆయన గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని ఆమె వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.సదుంలో..

తనకల్లు: మండలంలోని టి.సదుం పంచాయతీ ఎర్రచెరువుపల్లి, నందిగానిపల్లి, అగ్రహారం, టి.సదుం, బంగారువాండ్లపల్లి, కాటేపల్లి, బిసనవారిపల్లి, తమ్మిశెట్టివారిపల్లి గ్రామాల్లో కందికుంట వెంకటప్రసాద్ బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఆయన ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు మొండెం వెంకటరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఫణీకర్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కదిరిలోని 34వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

సర్టిఫికెట్లు సమర్పించండి

పుట్టపర్తి రూరల్, మే 2: ఆదర్శపాఠశాల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు శుక్రవారం నుంచి ఐదో తరగతికి సంబంధించిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాను నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు నేటి నుంచి ఐదో తరగతి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, తనతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, తల్లి బ్యాంకు పాస్‌బుక్కు, కులధ్రువీకరణ పత్రం, నాలుగు ఫొటోలు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం

బుక్కపట్నం, మే2: మండలంలోని గసికవారిపల్లి పంచాయతీలో గురువారం కూటమి శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి పథకాల గురించి వివరించారు. వాటివల్ల ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. కూటమి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అప్పస్వామి, బొట్టు కిష్టప్ప, వెంకటరాముడు, నాయుడు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని బాబాసాహెబ్‌పల్లి, మారెవాండ్లపల్లిలో టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆ పథకాల వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. కూటమిఅధికారంలోకి రాగానే పథకాలు అమలవుతాయన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీసభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, నాయకులు మండోజీ ఆర్ఫీఖాన్, నిజాం, చికెన్ షానూ, నరసింహులు, శివారెడ్డి, సౌదీ నాగరాజు, మస్తానమ్మ, భాగ్యమ్మ, జ్యోతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలోని అప్రాచెరువు, చిన్నరాయపట్నం, గరశనపల్లి గ్రామాల్లో టీడీపీ, బీజేపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్ యాదవ్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు.

ఘనంగా దాచూరి రామిరెడ్డి వర్ధంతి

కదిరిఅర్బన్, మే 2: శాసన మండలి మాజీ సభ్యుడు, దాచూరి రామిరెడ్డి 8వ వర్ధంతిని పట్టణంలోని యూటీఎఫ్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తన తుది శ్వాస వరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తాహెర్‌వలి, సునీల్ కుమార్, ఆజాంబాషా, మనోహర్, మహబూబ్‌బాషా, రమేష్, నాగరాజు, బ్రహ్మచారి, ఖాజా, మధుసూధన్, బాలాజీనాయక్ తదితరులున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో గిరిజన తండాలు

● కనీస వసతులు కూడా కరువు

తనకల్లు, మే 2: మండలంలోని గుట్టమీదతండా, జమ్లానాయక్ తండా, మోతకులకుంట తండా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు కావస్తున్నా నేటికి ఆ గిరిజనతండాలు కనీస వసతులకు కూడా నోచుకోలేదు. రోడ్లు లేకపోవడంతో తండాలకు రాకపోకలు సాగించాలంటే గిరిజనులు పడుతున్న బాధలు వర్ణానాతీతంగా ఉన్నాయి. అత్యవసవసర సమయాల్లో 108 లాంటి వాహనాలు వెళ్లడానికి కూడా వీలుకానిస్థితి నెలకొంది. తండాల్లో సిమెంటు రోడ్లు మచ్చుకైనా కనిపించించడం లేదు. ఇక డ్రైనేజీలు పరిస్థితి సరేసరి. విద్యార్థులకు పాఠశాలలు కూడా లేవు. ఎందరో రాజకీయ నాయకులు మారుతున్నా, ఈ తండాల్లో పరిస్థితులు మాత్రం మారడం లేదని గిరిజనులు వాపోతున్నారు.



సీసీరోడ్డుకు నోచుకోని గుట్టమీదతండా

రూ.లక్ష పట్టివేత

కదిరి, మే 2: పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న ఓ ప్రయివేటు ఆసుపత్రి వద్ద ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును తనిఖీల్లో పట్టుకున్నట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ అనంతపురం పట్టణానికి చెందిన మగ్బుల్ కుమారుడు ఇలియాజ్ అనే వ్యక్తి నుంచి బుధవారం లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదు సీజ్ చేసి, ఎన్నికలాధికారి వంశీకృష్ణకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

భద్రత కట్టుదిట్టం చేయండి: ఎస్పీ

హిందూపురం/ గోరంట్ల, మే 2: సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న సందర్భంగా ఈనెల 13వరకు సరి హద్దు చెకపోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని అక్కడున్న సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా అనుమానితులు వచ్చినా, ఓటర్లను ప్రలోభ పెట్టే వస్తువులు, నగదు, మద్యం మన జిల్లాలోకి వస్తే చర్యలు ఉంటాయన్నారు. చెక్ పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. హిందూపురం, లేపాక్షి గోరంట్ల మండల పరిధిలో ఉన్న చెకపోస్టులు తనిఖీ చేశారు.

పొంచివున్న ప్రమాదం

● శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

● భయాందోళనల్లో స్థానికులు



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

నల్లమాడ, మే 2: మండలకేంద్రంలోని అక్కమ్మగారి వీధిలో ఓ విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. ఆ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కిందిభాగంగా ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. ఇది అప్పుడో.. ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉందని, దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్తంభం మార్చాలని పలు మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించామని, ఎవరూ స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని ఆ స్తంభాన్ని తొలగించి.. కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

పింఛన్‌దారుల కష్టాలు

●ధర్మవరంలో బ్యాంకుల వద్ద పడిగాపులు ●ఎండవేడిమికి విలవిల్లాడిన వృద్ధులు

ధర్మవరం రూరల్, మే 2: ప్రభుత్వం ఈనెల పింఛన్‌ను పింఛన్‌దారులకు తమ బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసింది. వాటిని డ్రా చేయడానికి గ్రామాల నుంచి వచ్చిన పింఛన్‌దారులు ధర్మవరం పట్టణంలోని బ్యాంకుల వద్ద పడిగాపులు కాచారు. మండుతున్న ఎండలకు క్యూలైన్‌లో నుంచోలేక వృద్ధులు అవస్థలు పడ్డారు. బ్యాంకుల వద్దే కాకుండా బ్యాంకులకు సంబంధించిన కస్టమర్ సర్వీస్‌పాయింట్ వద్ద కూడా గంటల కొద్దీ వేచి ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు నానా ఆగచాట్లు పడ్డారు. ఆటోల్లో, ద్విచక్రవాహనాల్లో వచ్చి పింఛన్ నగదు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాచి ఇబ్బందులు పడ్డారు. మాలాంటి వృద్ధుల పైనా ఈ ప్రభుత్వం ప్రతాపం చూపేదంటూ పలువురు వాపోయారు. సచివాలయంలో అంతమంది ఉద్యోగులు ఉంటారు కదా.. వారితో పంపిణీ చేయచ్చుకదా అని ఆవేదన వ్యక్తం చేశారు.



ధర్మవరంలో ఎస్‌బీఐ సర్వీస్‌పాయింట్ వద్ద వేచివున్న వృద్ధులు

భద్రత కట్టుదిట్టం చేయండి: ఎస్పీ



గోరంట్లలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం/ గోరంట్ల, మే 2: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సందర్భంగా ఈనెల 13వరకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని అక్కడున్న సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా అనుమానితులు వచ్చినా, ఓటర్లను ప్రలోభ పెట్టే వస్తువులు, నగదు, మద్యం మన జిల్లాలోకి వస్తే చర్యలు ఉంటాయన్నారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. హిందూపురం, లేపాక్షి గోరంట్ల మండల పరిధిలో ఉన్న చెక్‌పోస్టులు తనిఖీ చేశారు. అదేవిధంగా హిందూపురం, బిట్‌కళాశాల, నాయనపల్లి గురుకులపాఠశాల, లేపాక్షి సమీపంలో ఈవీఎం కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

-డీఎంహెచ్ఓ

మడకశిర రూరల్, మే 2: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. ఆమె గురువారం మండలంలోని నీలకంఠాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు మండలాల డాక్టర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంజువాణి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయన్నారు. దీంతో వడదెబ్బ సోకకుండ ప్రజలు జాగ్రత్తలు పాటించేలా గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు నూకలు చెల్లాయ్..

రోడ్‌షోలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

రొద్దం, మే 2 : ఐదేళ్లకాలం నుంచి గ్రామాల్లో అభివృద్ధి చేయక ప్రకృతి సంపదను దోచేసిన వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లే కాలం దగ్గరపడిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. ఆమె గురువారం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితో కలిసి మండల పరిధిలోని బొక్సంపల్లి, శ్యాపురం, కంబాలపల్లి, బీదానిపల్లి, కనుమర, నారనాగేపల్లి, నాగిరెడ్డిపల్లి, రాచూరు, జక్కలచెరువు, కుర్లపల్లి, కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లిల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ కళ్యాణదుర్గంలోని ఇసుకను దోచుకుని పెనుకొండకు వచ్చిన మంత్రి ఉషశ్రీ చరణ్ వద్ద అక్రమంగా సంపాదించిన డబ్బుంటే తమవద్ద ప్రజాబలం ఉందన్నారు. ఆమె ఓటుకు రూ.5వేలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ డబ్బంతా ప్రజల సొమ్మే అన్నారు. ఆ డబ్బు తీసుకుని టీడీపీకి ఓటేయాలని ప్రజలను కోరారు. మోసపోయి ఆమెకు ఓటేస్తే ఈ ప్రాంతంలోని ఇసుకను అక్రమంగా బెంగళూరుకు తరలిస్తుందన్నారు. తమ తండ్రి రామచంద్రారెడ్డి కాలం నుంచి పరిటాల రవి, సునీత, బీకే పార్థ సారథి వరకు చేసిన అభివృద్ధి పనులే గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాలకు చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, చిన్నప్పయ్య, చంద్ర మౌళి, నరసింహులు, నరహరి, హరీష్, కంబాలపల్లి సర్పంచ్ మంజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మనోహర్, నాగభూషణం, వాల్మీకి చంద్ర శేఖర్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



రొద్దం రోడ్‌షోలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



పెనుకొండలో మాట్లాడుతున్న సవిత

టీడీపీలోకి పలువురి చేరిక

పెనుకొండ టౌన్: టీడీపీ స్థానిక కార్యాలయంలో గురువారం పలువురు టీడీపీలో చేరారు. వారికి సవిత కండు వాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గొల్లపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తిచేసి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 30చెరువులకు నీరందించారని తెలిపారు. అయితే కాలువలు వెడల్పుచేసి గోరంట్ల మండలంలోని 93 చెరువులకు నీరందిస్తామని ఎమ్మెల్యే శంకర్ నారాయణ ప్రగల్భాలకే పరిమితమయ్యాడని, ఇప్పుడు ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీదానిపల్లి సర్పంచ్ మంజునాథ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని బూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, కొత్తపల్లితండా, ఎర్రబల్లికి గ్రామాల కు చెందిన 45కుటుంబాలు వైసీపీనుంచి గురువారం టీడీపీలో చేరారు. బీ కొత్తపల్లికి చెందిన గట్టు సూర్య ప్రకాష్‌రెడ్డి, నరసింహారెడ్డి, పుట్టగుండ్లపల్లి వార్డు సభ్యులు సోమప్ప, రాము, ప్రకాష్, వలంటీర్లు కమలాకర్, సురేష్, కొత్తపల్లి తండాకు చెందిన పలువురు గిరిజనులు టీడీపీలో చేరారు. గోరంట్లలోని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప నివాసం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బులెట్లు దింపడం ఉషశ్రీ చరణ్‌కు అలవాటే

గోరంట్ల: మంత్రి ఉషశ్రీ చరణ్‌కు బుల్లెట్లు దించడం అలవాటే అని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత విమర్శిం చారు. ఆమె కళ్యాణదుర్గంలో ఎలా బుల్లెట్లు దింపిందో, ఎన్ని కేసులు పెట్టించిందో, ఎంత దోచుకుందో ప్రజలం దరికి తెలుసన్నారు. సవిత గురువారం గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలా వచ్చానన్నది కాదు, బుల్లెట్ దిగిందా_లేదా.. అంటూ వైసీపీ అభ్యర్థి ఉషశ్రీ గోరంట్లలో చేసిన వ్యాఖ్య లపై సవిత స్పందించారు. కళ్యాణదుర్గం ప్రజలు ఆమె ను ఎలా ఆదరించారో అందరికీ తెలుసన్నారు. వైసీపీ వారు బెదిరింపులు, కుట్ర రాజకీయాలకు పాల్పడుతు న్నా ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారన్నారు.



గోరంట్లలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సవిత, నిమ్మల కిష్టప్ప

టీడీపీ నాయకుల ప్రచారం

గుడిబండ, మే 2 : టీడీపీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆయన గురువారం టీడీపీ శ్రేణులతో కలిసి మండలంలోని జమ్మలబండ గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనాథ్, బోజరాజు, రవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం ఏకతాటిపైకి...

చిలమత్తూరు, మే 2: ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే ఉద్దేశంతో మండలంలోని పలువురు ఎన్నో ఏళ్లుగా ఉన్న శత్రుత్వం వదిలి ఒక్కటవుతున్నారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ గౌరీశంకర్ ఐదేళ్ల కిందట పార్టీ బహిష్కరణకు గురయ్యారు. అప్పటి నుంచి ఉన్నారు. ఆయన గురువారం టీడీపీలో చేరారు. ఆయన కు పార్టీ మరో మాజీ కన్వీనర్ నందీషప్ప మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంతటి వైరం ఉం డేది. అయితే ఆ ఇద్దరు గురువారం టీడీపీ మండల సీనియర్ నాయకుడు నాగరాజుయాదవ్, మండల కన్వీనర్ రంగారెడ్డి సమక్షంలో ఒక్కటయ్యారు. బాలయ్య గెలుపు కోసం తమ శత్రుత్వాలను పక్కన పెట్టి ఏకమవుతున్నామని వారు పేర్కొన్నారు. అనంతరం వారందరూ కలిసి ఇంటింట ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. టీడీపీ మేనిఫెస్టోపై ఓటర్లకు అవగాహన కల్పించారు. బాలయ్య ఎమ్మెల్యే అయితేనే నియోజకవర్గం, టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతాయని ప్రచారం చేశారు. ఈ నెల 13న ప్రతి ఒక్కరు ఎమ్మెల్యేగా బాలకృష్ణకు, ఎంపీగా పార్థసారథి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, అశ్వత్థప్ప, బయపరెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మీ ఆస్తులకు బాలయ్య రక్షణ

టీడీపీ గెలిస్తే మీ వ్యాపారాలకు ఇబ్బంది ఉండదు: వసుంధరాదేవి



నందమూరి వసుంధరాదేవికి గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

హిందూపురం, మే 2: నందమూరి బాలకృష్ణను మూడోసారి గెలిపించుకుని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మీ ఆస్తులకు రక్షణ ఉంటుందని నందమూరి వసుంధరాదేవి అన్నారు. ఆమె గురువారం స్థానిక మేళాపురం, ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసుంధరాదేవి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మీ వ్యాపారాలకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ ఐదేళ్లలో ఇబ్బందిపడ్డ విషయం తెలిసిందే. అలాంటి ఇబ్బందులు ఉండకూడదంటే సైకిల్‌కు ఓటేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బాలకృష్ణ ఎంతో కృషిచేశారన్నారు. దశాబ్దాలకాలంగా ఉన్న నీటి సమస్య పరిష్కరించింది టీడీపీయే అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేనేతలకు పెద్దపీట వేశారన్నారు. మరమగ్గాలకు విద్యుత్‌పై రాయితీ ప్రకటించారన్నారు. కష్టపడే మనస్తత్వం ఉన్నవారు, నిజాయితీగా ఓటేసే వారు ఈ ప్రాంతంలో ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు తెస్తారని హామీ ఇచ్చారు. ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి, మేళాపురం ప్రాంతాలు తెలుగుదేశంపార్టీకి కంచుకోటలాంటివన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు వన్‌సైడ్‌గా టీడీపీకి పట్టం కడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో మరింత మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. చేనేతలకు ఇళ్లస్థలాలు ఇస్తామన్నారు. హిందూపురం పట్టణ అభివృద్ధి వేగంగా జరగాలంటే బాలకృష్ణతోనే సాధ్యమన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ నియోజకవర్గ రూపురేఖలు మార్చడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. మేనిఫెస్టోపై ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ రావిళ్లలక్ష్మి, టీడీపీ నాయకులు బండా రుబాలాజీ, మారుతి, పల్లా కుమార్, ఏసీ నాగరాజు, కోరుముట్ల నాగేంద్ర, హరి, బాబు, ఆదిమూర్తి, శ్రీనివాస రెడ్డి, అమీన్, నెట్టప్ప, వెంక టేశ్, చంద్రమోహన్, హమీద్, నజీర్, బాబాఫక్రుద్దీన్, డీఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న నందమూరి వసుంధరాదేవి

ఉపాధి పనులను వేగవంతం చేయాలి: డ్వామా పీడీ

రొద్దం, మే 2 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులను వేగవంతం చేయాలని జిల్లా డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం రొద్దం మండల పరిధిలోని ఎం కొత్తపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఉపాధిహామీ పనుల్లో రొద్దం మండలం వెనుకబడిందని, పద్ధతులు మార్చుకోవాలని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, పనులు చేయనివారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పింఛన్ కోసం అవ్వాతాతల కష్టాలు

హిందూపురం అర్బన్, మే2: ఈ నెల కూడా అవ్వాతాతలకు పింఛన్‌కు కష్టాలు తప్పలేదు. పింఛన్ సొమ్ము వారు ఖాతాల్లో జమకాలేదు. దీంతో పాపం వృద్ధులు ఎండను సైతం లెక్కచేయ కుండా బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అవడంతో పింఛన్ సొమ్ము జమ చేయలేక.. చంద్రబాబు ఫిర్యాదు వల్లే ఇంత ఆలస్యం అవుతోందని సీఎం జగన్ ప్రజలను మభ్యపెడుతున్నాడని ప్రజలు మాటాల్డుకోవడం విశేషం. నిజానికి చంద్రబాబు రూ. 4 వేలు పింఛన్ ప్రకటించడంతో ప్రజలు ఇక టీడీపీ కూటమికి ఓటు వేయడం ఖాయమని ప్రజలను ఇలా సతాయిస్తున్నారని ప్రజలంటున్నారు. బ్యాంకుల వద్ద పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు బారులు తీరారు.



బ్యాంకులో పింఛన్ కోసం ఇలా

దద్దమ్మ వైసీపీని సాగనంపుదాం

ఎన్నికల ప్రచారంలో బీకే



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీకే పార్థసారథి

పుట్టపర్తి, మే 2: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో ఒక్క అభివృద్ధి కూడా చేయకుండా ప్రజలను మోసం చేసిన వైసీపీ దద్దమ్మ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి తీవ్రంగా విమర్శించారు. రొద్దం మండల పరిధిలోని బొక్సంపల్లి, శ్యాపురం, కంబాలపల్లి, బీదానిపల్లి, నారనాగేపల్లి, జక్కలచెరువు, కనుమర, రాచూరు, నాగిరెడ్డిపల్లి, కుర్లపల్లి, కందుకూర్లపల్లి చిన్న కోడిపల్లిల్లో బీకే గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి సవితతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. నారనాగేపల్లిలో బీకే మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు ఏఒక్క పరిశ్రమైనా తీసువచ్చి ఏ ఒక్కరికైనా ఉపాధి అవకాశాలు కల్పించవా జగన్ అని ప్రశ్నించారు.. మరి ఏముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నారో చెప్పాలని నిలదీశారు. జిల్లాను ఆటోమొబైల్ హబ్‌గా తీసుకువచ్చి ప్రజల తలసరి ఆదాయం పెంచిన ఘనత టీడీపీదే అన్నారు. కాలువ గట్టుపై నిద్రించి వేలాది కోట్లు నిధులు ఇచ్చి సాగుతాగునీరు తెచ్చింది టీడీపీ ప్రభుత్వమే అన్నారు. అరాచక పాలన సాగించి అన్ని వర్గాల ప్రజలపై బాదుడు వేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఈనెల 13న ఓటుతో తిమ్మదిరిగే తీర్పుఇవ్వబోతున్నారన్నారు. వలస పక్షులు వస్తుంటారు దోచుకుని వెళ్తుంటారని ఈ ప్రాంత వాసులైన తనకు సవితకు చెరోఓటేసి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. వచ్చే కూటమి ప్రభుత్వమే అని కూటమి మేనిఫెస్టోతో సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ హయంలోనే అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ తెచ్చి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు రూ.10లక్షలు వడ్డీలేని రుణం ఇస్తామని ప్రకటించడంతో నారనాగేపల్లిలో టీడీపీ నాయకులు, మహిళలు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రచారంలో బీకేకు గ్రామగ్రామాన పూల వర్షం కురిపిస్తూ ప్రజలు అభిమానాన్ని చాటుకున్నారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, చిన్నప్ప య్య, చంద్రమౌళి, నరసింహులు, నరహరి, హరీష్, కంబాలపల్లి సర్పంచ్ మంజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మనోహర్, నాగభూషణం, వాల్మీకి చంద్రశేఖర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

టీడీపీ విజయం తథ్యం

అగళి, మే 2: నియోజకవర్గంలో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ కుమారస్వామి, మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ పేర్కొన్నారు. వారు గురువారం మండలంలోని డొక్కలపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మడకశిరలోని యాదవ కళ్యాణమండపంలో జరిగిన దళిత యువజనసమ్మేళనికి, అమరాపురంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఇంటివద్దే జరిగే సమావేశానికి తరలి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారం

మడకశిరటౌన్, మే 2: మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.సుధాకర్‌కు మద్దతుగా సీడబ్ల్యుసీ సభ్యులు మాజీ మంత్రి రఘువీరారెడ్డి గురువారం ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుండి గాంధీబజార్ మీదుగా అమరాపురం రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అదేవిధంగా న్యాయవాదులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. రఘువీరారెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగ్దానం మరచిన జగన్

- విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం అర్బన్, మే 2: గత ఎన్నికల్లో పురంలో డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేస్తానని అంబేద్కర్ సర్కిల్‌లో సీఎం జగన్ బహిరంగా ప్రకటన చేసి ఇచ్చిన వాగ్దానం మరిచారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఘాటుగా విమర్శించారు. రెండు యూనియన్‌ల నాయకులు ఉమ్మడిగా గురువారం పురంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిందూపురంలో ఇంతవరకు బాలురకు ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేవంటే ఎంత నీచంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు వసతి గృహాలు లేక బాడుగ భవనాల్లో మగ్గుతున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, విద్యార్థి సంఘాల నాయకులు తరుణ్, జస్వంత్, దేవరాజు, శశి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే 2: మండలంలోని గుంతపల్లికి చెందిన సునీత అనే మహిళ గురువారం అధిక మోతాదులో మాత్రలు మింగి గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ వైద్యచికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మడకశిరటౌన్, మే 2: మడకశిర పట్టణ సమీపంలోని పెనుకొండ రోడ్డు చౌటిపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని భాస్కర్(22) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. పట్టణానికి చెందిన ప్రభాకర్ కుమారుడు భాస్కర్ బుధవారం రాత్రి 10గంటల సమయంలో పని నిమిత్తం బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో ఫోన్‌చేసి ఇంకా ఇంటికి రాలేదని ప్రశ్నించగా మరికొద్ది సేపటికి వస్తానని చెప్పిన వ్యక్తి రాలేదు. తెల్లవారుజామున అతడి సెల్‌కు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. అయితే ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు వార్తలు రావడంతో వెళ్లి చూడగా భాస్కర్ మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దళిత ద్రోహి జగన్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మే 2: సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితుల 27 పథకాలను రద్దు చేసి, దళిత ద్రోహిగా నిలిచిపోయారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు అన్నారు. పట్టణంలోని యాదవ కల్యాణమండపం ఆవరణంలో గురువారం నిర్వహించిన దళితుల ఆత్మీయ సమావేశంలో ఆయన నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలిసి పాల్గొని మాట్లాడారు. గతంలో చంద్రబాబు తెచ్చిన ఎస్సీ వర్గీకరణ ప్రత్యేక ఆర్డినెన్స్‌తో 25వేల మంది దళితులకు ఉద్యోగాలు లభించాయన్నారు. భూమి కొనుగోలు పథకం కింద పేద దళితులకు 12 వేల ఎకరాలు ఇచ్చారన్నారు. అయితే ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించి ఆర్థికంగా లబ్ధి పొందిన వ్యక్తి జగన్ అన్నారు. ఎస్సీ అయిన తన పైనే ఎస్సీఎస్టీ కేసును పెట్టించిన మూర్ఖుడన్నా రు. పులివెందులలో హత్యకు గురైన నాగమ్మఅనే దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని పోరాడితే తనపైనే కేసు పెట్టారన్నారు. తుగ్గలిరెడ్డి ఒక కులం అహంకారి అని, సామాజిక సమ తుల్యం పాటించడన్నారు. దళిత బిడ్డలకు విద్యను దూరం చేసిన దుర్మార్గుడన్నారు. అనంతరం ఆయన మధ్యాహ్నం యాదవ కల్యాణ మండపంలో టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీకి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లే పట్టుగొమ్మలని పేర్కొన్నారు. ఎన్నికలకు కేవలం పది రోజులు ఉం దని, మడకశిరలో టీడీపీ జెండా ఎగరాలంటే ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని ఎంఎస్ రాజు కోరారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్ జయకు మార్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు, నాయకులు గోవిందప్ప, కన్నా, రాజు, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. హరేసముద్రం గ్రామానికి చెందిన వలంటీర్ కవిత, మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి గురువారం పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.



టీడీపీలోకి చేరిన వారితో ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మావయ్యా.. నేనూ వస్తా..!

మేనల్లుడి వేసవి విహారయాత్ర విషాదాంతం

ఆగివున్న సిమెంటు లారీని ఢీకొన్న వ్యాన్

తమిళనాడుకు చెందిన మామ.. మేనల్లుడి మృతి







లారీని ఢీకొన్న వ్యాన్, విజయ్, తమిద్ మారన్ మృతదేహాలు

పెనుకొండ రూరల్, మే 2: తమిళనాడులోని తిరువన్నామలైకి చెందిన తమిద్‌మారన్ ఆరో తరగతి చదువుతున్నాడు. బడికి వేసవి సెలవులు వచ్చాయి. తన మేన మామ విజయ్ క్యాంటర్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సరుకు రవాణా కోసం వివిధ ప్రాంతాలకు వెళుతుంటాడు. మేనల్లుడికి మామ వెంట వెళ్లి ఊళ్లన్నీ తిరగాలనిపించింది. 'మామా.. మామా.. నేనూ వస్తా నీ వెంట..' అని గోముగా అడిగాడు. బహుశా తను.. 'వద్దురా.. ఎండలకు తట్టుకోలేవు..' అని సముదాయించి ఉంటాడు. ముద్దుల మేనల్లుడు బుంగమూతి పెట్టగానే.. చెల్లెకి నచ్చజెప్పి వెంట తీసుకెళ్లింటాడు. అలా వారి ప్రయాణం.. అమరపురిదాకా కొనసాగింది. అత్యంత విషాదకరంగా మేనల్లుడు, మేనమామ మృత్యువాత పడ్డారు. పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలో ఆగి ఉన్న సిమెంటు లారీని వారి క్యాంటర్ వాహనం ఢీకొట్టింది. 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘోర ప్రమాదంలో డ్రైవర్ విజయ్(29), అతని మేనల్లుడు తమిద్‌మారన్(11) మృతిచెందారని కియ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపారు. క్యాంటర్ వాహనంలో తిరువన్నామలై నుంచి పండ్లు తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి అన్‌లోడ్ చేశారు. అక్కడి నుంచి తుక్కును (స్క్రాప్) తీసుకుని బెంగళూరులో అన్‌లోడ్ చేసేందుకు బయలుదేరాడు. గుట్టూరు సమీపంలో వేకువజామున జాతీయ రహదారి పక్కన ఆగివున్న సిమెంటు లారీని గమనించక బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు గురువారం రాత్రికి పెనుకొండ వచ్చారు. ఇద్దరి మృతితో ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది.